ప్రజల మాట ప్రగతి బాట

మంచిర్యాల నియోజకవర్గం

# సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు

● కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, అక్టోబర్ 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ (ప్రొహిబిషనరీ) శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన బృంద ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అధ్యయనం చేసిన అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బృంద ప్రతినిధులు లక్సెట్టిపేట మండలంలోని గుల్లకోట, హాజీపూర్ మండలంలోని దొనబండ, తాండూర్ మండలంలోని మాదారం, బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లి, భీమిని మండలంలోని బిట్టూరుపల్లి గ్రామాల్లో పర్యటించామని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను పరిశీలించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యర్థాల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయించి ఆదాయం సమకూర్చామని, ఈ ప్రక్రియపై డాక్యుమెంటేషన్ రూపొందించనున్నట్లు తెలిపారు. 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో మొదటి విడుతలో 248 పాఠశాలలను ఎంపిక చేసి 12 రకాల విభాగాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బృందం ప్రతినిధులు మాట్లాడుతూ తమ అధ్యయనంలో భాగంగా జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టిన పరిశీలనకు అన్ని సదుపాయాలు కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ కలెక్టర్‌కు మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ సంతోష్‌కు మెమొంటో అందజేస్తున్న బృందం ప్రతినిధులు

**పటిష్టంగా ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్**

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్, తరలించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సిడాం దత్తు, రాములుతో కలిసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్‌ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల గోదామునుంచి ఈవీఎం, వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను నియోజకవర్గాలకు తరలింపు, నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చడం, స్ట్రాంగ్‌రూంల వద్ద 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని బెల్లంపల్లి పట్టణంలోని బజార్‌ఏరియాని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1438 బ్యాలెట్‌యూనిట్లు, 1,134 కంట్రోల్‌యూనిట్‌లు, 1,113 వీవీ ప్యాట్‌లు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కేటాయింపు, తరలింపుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

● రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

గర్మిళ్ల, అక్టోబర్ 20: భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఎలాంటి వస్తువులను సరఫరా చేయకుండా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ అధికారులందరూ రెవెన్యూ, ఎక్సైజ్, అటవీ, వాణిజ్య పన్నులు, రవాణా శాఖలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తేదీ నాటి నుంచి ఇప్పటి వరకు రూ.3,17,23,770.75 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, నగదు, మద్యం, బెల్లం, పటిక, గంజాయిని రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతాలు, క్లిష్టమైన పోలింగ్ లొకేషన్ ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నగదు, బంగారం, వెండి, విలువైన వస్తువులు తీసుకువెళ్తుంటే ఆధారాలు చూపించి పోలీసులకు సహకరించాలన్నారు.

## బెల్లంపల్లిలో గంజాయి సాగు

● పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
● పరారీలో ఇంటి యజమాని



కుమ్మరి లింగయ్య ఇంటి పెరట్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలు

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 20: బెల్లంపల్లిలో గంజాయి మొక్కల సాగు చేస్తున్న వ్యవహారాన్ని శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. బెల్లంపల్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నంబర్ 2 ఇంక్లైన్‌బస్తీలో గంజాయి సాగవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానికంగా ఉంటున్న కుమ్మరి లింగయ్య ఇంట్లోని పెరట్లో తనిఖీ చేసి ఆరు గంజాయి మొక్కలు సాగవుతున్నట్లు గుర్తించారు.పెరట్లో సాగవుతున్న గంజాయి మొక్కలను విచారణ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెల్లంపల్లిటూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఇంటి యజమాని కుమ్మరి లింగయ్య పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## తాళ్లపేటలో ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

దండేపల్లి, అక్టోబర్20: దండేపల్లి మండలంలోని తాళ్లపేటలో 'ద సీక్రెట్ ఆఫ్ లెజెండ్' క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి.1997–98కి చెందిన పూర్వ క్రికెటర్లు ఈతరం క్రికెటర్లకు తామేం తక్కువ కాదంటూ బ్యాట్, బాల్ చేతపట్టి ఆకట్టుకున్నారు. ఫోర్లు, సిక్సర్లతో ఉత్సాహంగా మైదానంలో కదిలారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాలలో స్థిరపడ్డ వీరు ఆనాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఎప్పుడూ రోజూవారి కార్యకలాపాల్లో బిజీగా ఉండే వీరు ఒకరోజు పోటీల్లో భాగంగా బ్యాట్, బాల్ చేతపట్టి బాల్యాన్ని, గుర్తుకు తెచ్చుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన జట్టు 16 ఓవర్లలో 98 పరుగులు చేయగా, తదుపరి బ్యాటింగ్ చేపట్టిన జట్టు మూడు బంతులు మిగిలి ఉండగానే విజయలక్ష్మిని అందుకున్నారు. ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, బీట్ అధికారి అత్తె సత్తయ్య బహుమతులు అందజేశారు.

## మెజిస్ట్రేట్‌కు సన్మానం



మెజిస్ట్రేట్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 20 : చెన్నూర్ మున్సిఫ్ కోర్టులో మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ సంపత్ ఎల్ఎల్ చేసి, అదే కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేసినందుకు ఆయనను జిల్లా న్యాయవాదులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో పుట్టి కష్టపడి అత్యున్నత చదువును అధిరోహించడం గర్వించదగిన విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదులు కర్రె లచ్చన్న, కే సురేంద్రాచారి, బీ జగన్, ఎం.కార్తిక్, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



మంచిర్యాల ఏసీసీ : పూజలు చేస్తున్న భక్తులు

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 20 : మంచిర్యాల విశ్వనాథ కాలక్షేప మండపం ముఖరాం చౌరస్తాలో సర్వజనినీ దుర్గాదేవి పూజ 15వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గా దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. షష్టి పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు సతీమణి నడిపల్లి రాజ కుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తి సరోజ, దొంతుల ముఖేశ్, నల్ల శంకర్, సిరిపురం శ్రీనివాస్, జూపాక సుధీర్, కౌన్సిలర్ మల్లేశ్వరి, రీనా రాణి దాస్, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులున్నారు.

**ఘనంగా కుంకుమపూజలు**

జన్నారం, అక్టోబర్ 20 :మండల కేంద్రంలోని దుర్గామాత మండపంలో కుంకుమపూజలను ఘనంగా నిర్వహించారు. ఇందులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు, దాతలు అన్నదానం చేశారు.



జన్నారం : కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

జన్నారం, అక్టోబర్ 20 :మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులను తహసీల్దార్ వేణుగోపాల్ పరిశీలించారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బంది వసతులు కల్పించాలని తెలిపారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో అన్ని గ్రామాల్లోని బీఎల్వోలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐలు భానుచందర్, గంగారాజా, 29 గ్రామాలకు చెందిన బీఎల్వోలున్నారు.

## అలరించిన అష్టావధానం

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 20 : శ్రీదేవీ నవరాత్రి సాహితీ సమర్చనలో భాగంగా శుక్రవారం చెన్నూర్ పట్టణంలో గ్రంథాలయం సమీపంలో డా.ఎంవీ పట్వర్ధన్ ఇంటి వద్ద తిరుపతికి చెందిన అవధాన కళానిధి, శతావధాన విద్వన్మరాళ ఆముదాల మురళి, శతావధాని ఆధ్వర్యంలో అష్టావధానాన్ని ఘనంగా నిర్వహించారు. సంచాలకులుగా సమస్యాపూరణ చక్రవర్తి బిరుదాంకితులు వరంగల్‌కు చెందిన కంది శంకరయ్య, ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన అవధాన ప్రియ గెంటెల జగదీశ్ చంద్రకుమార్ వ్యవహరించారు. అవధాని ఆముదాల మురళి ఎంతో చమత్కారంగా సమాధానాలు ఇచ్చారు. అంతకుముందు కవి సమ్మేళనం నిర్వహించగా, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మంచిర్యాలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన కవులు పాల్గొన్నారు. కవులతో పాటు అష్టావధానంలో పాల్గొన్న వారందరినీ పట్వర్ధన్ స్వరూప దంపతులు సన్మానించారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం పట్టివేత

లక్సెట్టిపేట, అక్టోబర్ 20: పట్టణంలో ఆబ్కారీ అధికారుల సోదాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సాయిబాబా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మూడు రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ పరిధిలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన బెల్టు దుకాణాల సోదాల్లో లక్ష్మీపూర్‌కు చెందిన దుర్గం భాగ్య, సలాకుల లక్ష్మి, మిట్టపల్లికి చెందిన రత్నం, లావణ్య, దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన మంచు రామకృష్ణ వద్ద అక్రమంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్న మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో ఆబ్కారి ఎస్ఐలు రాబర్ట్, మౌనిక, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

## రూ.1.52 లక్షల నగదు స్వాధీనం

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 20: బెల్లంపల్లి మండలంలోని లంబాడీతండా వద్ద శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నెన్నెల మండలం నగరం గ్రామానికి చెందిన మడి ఎర్రయ్య వద్ద రూ.52 వేలు, భీమిని కి చెందిన టకిరె దర్శన్ వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్ తెలిపారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో రూ.1.52 లక్షల నగదును ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. వాహనాల తనిఖీలో ఏఎస్ఐ లింగన్న, పోలీసు సిబ్బంది ఉన్నట్లు తెలిపారు.